క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల సమావేశం

సామర్లకోట: రుణమాఫీలో భాగంగా మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి నాలుగో విడత ఆసరా పొందే లబ్ధిదారుల సమావేశం బుధవారం తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తెలిపారు. ఈ మేరకు తోట గోపాలకృష్ణ హైస్కూల్ ఆవరణను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని సుజాత తెలిపారు.

ఆటో డ్రైవర్ల ర్యాలీ



సామర్లకోటలో ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

సామర్లకోట: ఓట్ల కోసం ఉచిత బస్సుల హామీ ఇచ్చి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టవద్దని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బస్సు కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు రొంగల నూకరాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆటోలు నడుపుకొంటున్నామని, మహిళలకు ఉచిత బస్సుల అవకాశం ఇస్తే తామంతా రోడ్డున పడతామని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇస్తున్నారని, ఆ హామీని విరమించుకోవాలని కోరారు. అలాగే సీఎం జగన్ ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి సంక్రాంతి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వాలనే ఆలోచన వాయిదా వేసుకున్నారని తెలిపారు. యూనియన్ నాయకులు డి.సోమేశ్వరరావు, ఎస్.నాగరాజు, ఎం.రాజన్న, లంకా మురళి, ఎ.సుందరరావు పి.రాంబాబు, కె.రామకృష్ణ, ఎస్ అప్పారావు, ఆర్.వీరభద్రరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు



పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించిన కౌన్సిలర్, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

సామర్లకోట: త్యాగరాజ ఆరాధనోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంగీత కళాకారులకు సామర్లకోట పుట్టినిల్లుగా చెప్తారు. ఈ మేరకు స్థానిక సంగీతరావుపేటకు చెందిన నాయిబ్రాహ్మణులు ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు త్యాగరాజస్వామి చిత్రపటానికి కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామాలయం నుంచి బళ్ల మార్కెట్ సెంటర్, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, దేవిచౌక్ నీలమ్మ చెరువు, గొల్లగూడెం మీదుగా తిరిగి రామాలయం వరకు నగర సంకీర్తన చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఏడిద గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణ కళాకారులు సంగీత కచేరీ నిర్వహించారు. త్యాగరాజ స్వామి వారి జన్మదినం రోజున భారతీయ సంగీత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు తెలిపారు. ఏడిద గ్రామానికి చెందిన కళాకారులు వెంటూరి రేణుక, మాచవరపు గంగభాస్కర్‌లను వీరభద్రరావు సత్కరించారు. స్థానిక సంగీత కళాకారుల సంఘ నాయకులు వెదురుపాక బలరాం, మల్లేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. త్యాగరాజు సంగీత నిధికి నివాళిగా ఏటా పుష్య బహుళ పంచమినాడు త్యాగరాజు ఆరాధనోత్సవాలు నిర్వహించడం పరిపాటి అని స్థానిక కళాకారులు చెప్పారు. గ్రామోత్సవం అనంతరం రామాలయంలో త్యాగరాజ కీర్తనలు సాయంత్రం వరకు నిర్వహించారు. సంఘ నాయకులు వెదురుపాక శ్రీను, బందల వీరబాబు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.89,490



మాండవ్య నారాయణస్వామి ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.89,490 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీలను లెక్కించారు. సుమారు ఆరు నెలల తరువాత హుండీల లెక్కించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మీ ప్రయాణం భద్రం

- రైల్వే భద్రతలో కీలకంగా జీఆర్‌పీ
- విధులకు అదనంగా.. ఆదర్శవంతంగా..

కాకినాడ క్రైం: కాకినాడ రైల్వే పోలీస్ ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేస్తోంది. విధి నిర్వహణతో పాటు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు ఇక్కడి అధికారులు, సిబ్బంది. సాధారణంగా ఇక్కడ నమోదయ్యే కేసుల పరిష్కారం అంత సులభం కాదు. అయినా పరిష్కారం దిశగా ప్రతి కేసును నడిపిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. ఎక్కడో పొరుగు జిల్లాలోనో లేదా రాష్ట్రంలోనో ప్రయాణం మొదలు పెట్టిన ఓ ప్రయాణికుడు తన వస్తువులు చోరీకి గురయ్యాయని చివరి హాల్ట్ అయిన కాకినాడ జీఆర్‌పీ పోలీసులను ఆశ్రయిస్తాడు. ప్రయాణికులు కోల్పోయిన విలువైన వస్తువులను తిరిగి రికవరీ చేసి పెట్టడంలో ఇక్కడి బృందం క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణపై వీరు చూపే చొరవ నిజంగా ఆదర్శవంతం. గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెందితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మృతదేహాన్ని భద్రపరిచి మరీ కుటుంబీకులకు అప్పగిస్తారు.

కేసుల గణాంకాలివే...

నేరాలు	2020లో	2021లో	2022లో	2023లో
మరణాలు	18	12	7	15
చోరీలు	2	2	4	6
రికవరీ శాతం	50	100	100	కొనసాగుతున్నాయి

ఆర్‌పీ ఓపీ..

కాకినాడ గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఓ అవుట్ పోస్టు కాగా ప్రధాన స్టేషన్ సామర్లకోటతో అనుసంధానమై ఉంటుంది. కాకినాడ ఆర్‌పీ ఓపీ (రైల్వే పోలీస్ అవుట్ పోస్టు) అధికారిగా ఎస్‌ఐ రవి కుమార్ కొనసాగుతుండగా ఐదుగురు సభ్యుల బృందంతో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మహిళా సిబ్బంది పనిచేస్తున్నారు. రైలు లోపల, ప్లాట్ ఫాంపై ప్రయాణికుల భద్రత జీఆర్‌పీ లక్ష్యం.

కాకినాడ యువతులకు రక్షణగా..

కొన్ని నెలల క్రితం టౌన్ స్టేషన్ నుంచి 5 గురు యువతులు పరీక్ష రాసేందుకు బెంగళూరు వెళ్లారు. మార్గ మధ్యలో దాదాపు రాష్ట్ర సరిహద్దులు దాటి పోతున్న వేళ బిహార్ బృందానికి చిక్కారు. వారు అసభ్యంగా ప్రవర్తించగా విద్యార్థుల్లో ఒకరు తండ్రికి ఫోన్ చేశారు. ఆయన జీఆర్‌పీ ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా అర్ధగంటలో ఆకతాయిలను అక్కడి పోలీసులు రైలు దింపేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంలో రవికుమార్ సహా కాకినాడ జీఆర్‌పీ బృందానికి ఎస్పీ ప్రశంసలు దక్కాయి.

విద్యార్థులకు సన్మార్గం బోధిస్తూ..

విధి నిర్వహణతో పాటు ఇక్కడి జీఆర్‌పీ సామాజిక బాధ్యతను అందిపుచ్చుకుంది. పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు రైలు ప్రయాణాలకు సంబంధించి భద్రత అంశాలు, అనుబంధ చట్టాలు, నేరాలు, వాటి నియంత్రణపై అవగాహన కలిస్తున్నారు. పలు నిరసనల్లో రైళ్లపై దాడులు సాధారణమవుతున్న ఉదంతాల నేపథ్యంలో, అందులో విద్యార్థులు పాల్గొంటున్న కారణంగా వీరి భవితకు జీఆర్‌పీ బృందం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడనున్నాయి.

ప్రయాణికుల బాధ్యతలు గుర్తు చేస్తూ..

రైలు ప్రయాణం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు రైలు వచ్చే సమయంలోపు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రైలు లోపల ఉండే ఆర్‌పీఎఫ్ సిబ్బంది సూచనకు అనుగుణంగా వ్యవహరించాలని చెబుతున్నారు. అలాగే అత్యవసర వేళల్లో చైన్ లాగి రక్షణ పొందే విధానాలపై అవగాహన కల్పించారు. ఫుట్‌పాత్ ప్రయాణం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన చర్యలను ప్రయాణికులకు బోధించారు. తోటి ప్రయాణికులు, రైలు సిబ్బందిని ఎటువంటి ఇబ్బందికి గురి చేయకుండా ప్రయాణం కొనసాగించాలని సూచించారు.

ముమ్మర తనిఖీలు..

మత్తు పదార్థాల తరలింపు సహా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్వహణకు స్వార్థపూరిత శక్తులు రైళ్లు, రైల్వే స్టేషన్లు వాటి పరిసరాలను కేంద్రంగా ఎంచుకుంటున్నారు. అటువంటి వారి భరతం పడుతున్నారు ఇక్కడి జీఆర్‌పీ సిబ్బంది. కాకినాడలో ఉన్న రెండు రైల్వే స్టేషన్ల భద్రతను ఈ బృందమే పర్యవేక్షిస్తోంది. టౌన్, పోర్టు స్టేషన్లలో పోలీస్ జాగిలాలతో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. స్టేషన్ పరిధిని పూర్తిగా సీసీ కెమేరాల నిఘాలోకి తీసుకుని నిరంతరాయంగా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఈ తనిఖీలతో భాగంగా పలుమార్లు గంజాయి తరలింపును అడ్డుకున్నారు. మత్తు నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు.



విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కాకినాడ జీఆర్‌పీ విధులు నిర్వర్తిస్తోంది. భద్రతతో పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైలు ప్రయాణ భద్రత ప్రాధాన్యాన్ని ప్రయాణికులు, సామాన్య ప్రజలకు తెలియజేస్తున్నాం. ఎన్నో సందర్భాల్లో విలువైన వస్తువులు కోల్పోయిన ప్రయాణికులు మా ప్రయత్నంతో తిరిగిపొంది ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తారు. రికవరీ కేసుల్లో ఎంతో శ్రమించి సత్ఫలితాలు రాబడుతున్నాం. కాకినాడ లైన్స్ ఇన్‌స్పెక్టర్ గౌస్ బేగ్ సహా ఉన్నతాధికారుల సహకారంతో ఇది సాధ్యమైంది.

– నందికి రవికుమార్, ఎస్ఐ, జీఆర్‌పీ



పోలీస్ జాగిలాలతో పార్శిళ్ల తనిఖీలు



ఖరీదైన కెమేరాను రికవరీ చేసి ప్రయాణికుడికి అప్పగిస్తున్న జీఆర్‌పీ సిబ్బంది



టౌన్ రైల్వే స్టేషన్ భద్రతను సీసీ కెమేరాల్లో పర్యవేక్షిస్తూ...

మరణించిన వారి ఓట్లు తొలగించాలి

ఆర్డీఓ సీతా రామారావు

సామర్లకోట: ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని ఆర్డీఓ జె.సీతారామారావు బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి బీఎల్‌ఓకు వెయ్యి ఓట్ల వరకు ఉంటాయని, వాటిని పర్యవేక్షించడం కష్టం కాదన్నారు. మరణ ధ్రువ పత్రం ఆధారంగా ఓటర్లను తొలగించాలన్నారు. కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే మున్సిపల్ కార్యాలయం నుంచి తీసుకోవాలన్నారు. ఏడాది క్రితం మరణించిన వారి పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉంటే బీఎల్‌ఓలపై చర్యలు ఉంటాయని ఆర్డీఓ హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన ఓటరు పోలింగ్ తేదీ ముందు వరకు ఓటరుగా పేర్లను నమోదు చేయించుకోవచ్చునని సూచించారు. మరణించిన ఓటర్ల వివరాలు సేకరించడంతో బీఎల్‌ఓలు చురుకుగా పని చేయాలన్నారు. ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌ఓల పని తీరును సూపర్‌వైజర్లు తరుచూ తనిఖీ చేయాలన్నారు. ఇదే తరుణంలో పోలింగ్ బూత్‌ల వద్ద లోపాలను గుర్తించాలని సూచించారు. దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ర్యాంప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు వారికి వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు పోలింగ్ బూత్‌ల వారి బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ ఫణికుమార్, మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజు పాల్గొన్నారు.



సామర్లకోటలో బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

ఓటరు జాబితాలో బీఎల్‌ఓలది కీలకపాత్ర

పెద్దాపురం: ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓల పాత్ర కీలకమైనదని, వారు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన ఎన్నికల ప్రక్రియపై వారితో సమీక్షించారు. ఓటరు జాబితాలో తప్పులు ముద్రణ అయితే బీఎల్‌ఓల పర్యవేక్షణ ఏ మేరకు ఉందో అర్థమవుతుందన్నారు. బీఎల్‌ఓల ఎన్నికల ప్రక్రియ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు. ఓటరు జాబితాకు అవసరమైన ఓట్లు చేర్పులు, మార్పులు, ఫొటో ముద్రణ అంశాలపై క్షుణంగా పరిశీలించిన తరువాత నివేదిక ఇవ్వాలన్నారు. కొంతమంది బీఎల్‌ఓల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, పట్టణ పరిధిలోని బీఎల్‌ఓలు మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ సూచించారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ చంద్రశేఖరం, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే ‘ఆడుదాం ఆంధ్రా’

కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: క్రీడాభివృద్ధికి కృషి చేస్తూనే, తగిన సౌకర్యాల్లేక క్రీడల్లో వెనుకబడిన క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్నిచ్చారని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజంలో అత్యంత ప్రతిభ గల క్రీడాకారులున్నారని, వారి ప్రతిభను వెలికితీసి, ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా నిర్వహించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ క్రీడా స్థలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. ఈ సంధర్భంగా క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, కొత్తపల్లి వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, శెట్టిబత్తిన సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ పిఠాపురం మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, పార్టీ నేతలు కొత్తపల్లి రమణబాబ్జి, నడిగట్ల చింతలరావు, ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

వైఎస్సార్ ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పకుండా, మహిళలకు అండగా ఉండేలా వైఎస్సార్ ఆసరా పంపిణీ చేస్తున్నారని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన పిఠాపురం పట్టణ వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రమం తప్పకుండా నాలుగు విడతలుగా మహిళలకు ఆసరా నిధులు విడుదల చేశారన్నారు. మహిళలు దీనిని సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద పిఠాపురం పట్టణంలో 723 మహిళా సంఘాల్లోని 7,193 మంది సభ్యులకు రూ.5.24 కోట్లు అందజేస్తున్నట్టు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పార్టీ నేతలు గండేపల్లి బాబీ, పచ్చిమళ్ల అప్పలరాజు, కొత్తపల్లి బుజ్జి, పెదపాటి నాగేశ్వరరావు, పలువురు వార్డు కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

నియోజకవర్గానికి పేరు తేవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా పేరిట క్రీడలు నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల విజేతలకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో దొరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్రీడా ప్రతిభ ఉంటుందని, వాటిని వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణ, గ్రామీణ యువత ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పెద్దాపురం, సామర్లకోట ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరరాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓలు శర్మ, చౌదరి, పార్టీ నాయకులు గోలి రామారావు, నల్లల గోవిందు, ఇనకోండ వీర విష్ణుచక్రం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దొరబాబు

గాంధీజీ ఆశయ స్ఫూర్తికి నడుం బిగించాలి



ఆర్డీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామారావు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆర్డీఓ సీతారామారావు తదితరుల నివాళి

పెద్దాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మగాంధీ ఆశయ స్ఫూర్తికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఓ వెంకటలక్ష్మి, డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో పాఠశాల చైర్మన్ రావయప్పు వీరబాబు, డైరెక్టర్ రాయవరపు సత్య గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే స్థానిక మెయిన్‌రోడ్డు గాంధీ విగ్రహం వద్ద సీఐటియు ఆధ్వర్యంలో నాయకులు సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ గాంధీ విగ్రహానికి నివాళులుర్పించారు.



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఆర్డీఓ జె.సీతారామారావు నివాళులు అర్పించారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన కృషిని నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టీపీఓ ఫణికుమార్, మేనేజర్ అచ్యుతరాజు, సిబ్బంది, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమర యోధులు, అమరవీరుల దినోత్సవం నిర్వహించాలని రైల్వే బోర్డు నిర్ణయించిన మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజరు జైన్, స్టేషన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నివాళులు

కొత్తపల్లి: మండలంలోని జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనారాయణ.. గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

అన్నదాతకు అందుబాటులో విద్యార్థులు

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్యామ్‌రాజ్ నాయక్

పెద్దాపురం: గ్రామీణ రైతులు వ్యవసాయ సూచనలు అమలు చేసేలా తమ కళాశాల విద్యార్థులు అందుబాటులో ఉంటారని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. మండలంలోని గోరింటలో మంగళవారం రైతు సదస్సు, ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల డీన్ శ్యామ్‌రాజ్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు నాలుగు నెలల పాటు కళాశాల విద్యార్థులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. సాగులో మెళకువలను రైతుల వద్ద నుంచి నేర్చుకోవడమే కాకుండా, వారికి అవసరమైన సూచనలు, సలహాలను వ్యవసాయ అధికారులు, కళాశాల అధ్యాపకుల నుంచి తెలుసుకుని రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేయనున్నట్టు తెలిపారు. తొలుత గ్రామ వ్యవసాయ భూములు, నీటి వనరుల లభ్యతతో కూడిన చిత్రపటాలను రైతులకు క్షుణ్ణంగా విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, శాస్త్రవేత్తలు ఉషారాణి, సీతారామశర్మ, గ్రామ ఎంపీటీసీ పచ్చిపాల సతీష్, రైతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గోరింట రైతు సదస్సులో మాట్లాడుతున్న డీన్ నాయక్

వృథాగా పోతున్న తాగునీరు

కొత్తపల్లి: అంబేడ్కర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో తాగునీరు వృథాగా పోతోంది. కొంతకాలంగా తాగునీరు వృథాగా పోతోందని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.



పైపులైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు